



# శుభాంగీ పరిణయమను ప్రేమ మహాత్మ్యం

ఒకనాటి పగలు మిట్టమధ్యాహ్నంవేళ, పురాణప్రసిద్ధుడైన జ్ఞాన తిమిరర్షి, కాగల కొందరు మహర్షులతో కలసి అడవి మార్గాన ప్రయాణించుచున్నారు. ఆయన ప్రయత్నం ఆ రోజు చీకటిపడేలోగా ద్వారకా నగరం చేరాలని. ఆయనకు శ్రీకృష్ణుడితో చాలా అవసరం అయిన పని పడింది.

అది గోప్యం, రహస్యం, మరో ప్రాణికి తెలీదు.

ప్రయాణం వేడిగా, ఆయాసంగా వుంది. ఏ చెట్టు కిందో కొంచెంసేపు విశ్రమించితే బావుంటుం దనుకుని తిమిరర్షి నడుస్తున్నవాడల్లా ఆగి, పక్కకు చూచాడు. అల్లంత దూరంలో ఒక వెలగచెట్టు క్రింద ఆయనకొక మనిషి కనుపించాడు.

అతడు పద్మాసనం లాంటిదేదో వేశాడు. గడ్డం బాగా పెరిగి వున్నది. మొలకు చిన్న కౌపీనం మాత్రం ఉన్నది. బాగా బక్కచిక్కి ఉన్నాడు. అతడి నేత్రాలు తిమిరర్షి వేపే చూస్తున్నవి.

ఇంత మహర్షినైన నన్ను, ఈ తాపసి ఎవడైతేనేం – ఆహ్వానించకపోతాడా? అనుకుంటూ తిమిరర్షి ఒక్క తృటికాలం అలా చూస్తూ వుండిపోయాడు.

కాని, తాపసి ఉలక లేదు, పలుక లేదు. నిశ్చలంగా చూస్తున్నాడు.

'వీడు గర్వి! తపస్సు ఫలించకముందే, ఇంత అహంకారం ప్రదర్శించేవాడు, రేపు ఏ శివుణ్ణో ప్రత్యక్షం చేసుకొని వరాలు పొందితే ఆ తర్వాత పట్టపగ్గాలు వుంటవా? వీణ్ణి మొగ్గగానే తుంచి వేయటం మంచిది' అనుకుంటూ తిమిరర్షి వెనక్కు చెయ్యి చాచి, "శిష్యా! ఆ శాపబలం వున్న కమండలం. ఇటు యివ్వు" అన్నాడు మేఘగంభీరంగా.

తిమిరుడు మాట ముగించే లోపలే వెలగ చెట్టు క్రింద వున్న తాపసి ఉలిక్కిపడి, చేతులు రెండూ జోడించి పైకెత్తి, "ఓ మహర్షీ! నన్ను శపించకండి! మీరు తొందరపడక కొంచెం సావధానంగా ఆలోచిస్తే నేనే కారణం వల్ల తమకు ఎదురు వచ్చి అర్ఘ్యపాద్యాలివ్వకపోయానో తెలుస్తుంది" అన్నాడు జీరపోయిన గొంతుతో.

ఆ మాటలతో తిమిరర్షి ముఖం అగ్నిగుండంలా అయింది. ఆయన భగభగమంటూ, "ఓరి తుచ్ఛా! నీదు ప్రవర్తన గురించి ఆలోచించేందుకేముంది? నీవు గర్వివి, అహంకారివి" అంటూ శిష్యుడిచ్చిన కమండలంలోంచి శాపజలం ఒలికించబోయాడు.

తాపసి ఈసారి నిలువెల్లా కంపించిపోతూ, "మహర్షీ! నన్ను అన్యాయంగా శపించకండి! ఇంత జరిగినా నేను కూచున్నచోటు నుంచి లేచి నిలబడేందుకు ఎందుకు సంశయిస్తున్నానో, తమరు గ్రహించలేదా?" అంటూ బావురుమన్నాడు.

ఆసరికి తిమిరర్షి క్కూడా ఏదో సందేహం కలిగింది. ఆయన తన దివ్యదృష్టిని తాపసి తల నుంచి దిగువకు ప్రసరింపచేసి ఉరిమినట్టుగా ఒక పెద్దనవ్వు నవ్వి వెనక్కు విరుచుకుపడబోయాడు.

కాని కానున్న ఋషులైన ఆయన శిష్యులిద్దరు గురువుగారు వెల్లికిలా పడకుండా మధ్యలోనే ఆదు కున్నారు. వాళ్ళకు గురువు ప్రవర్తన ఎంతో ఆశ్చర్యం కలిగించింది.

"కాలకౌపీనా! ఎంత పెద్ద చిక్కులో పడ్డావోయ్. ఈ సమయంలో ఆ పరమశివుడే నీకు ప్రత్యక్షమైనా, నువ్వు లేచి ఆయనకు సాష్టాంగా దండప్రణామాలాచరించలేవు. దీని కంతకూ కారణం నీ పూర్వజన్మ దుష్కృతం!" అంటూ తిమిరర్షి కదిలి తాపసి కేసి నడిచాడు.

ఈసారి గురువు ప్రవర్తన శిష్యులకు యితోధికమైన ఆశ్చర్యం కలిగించింది. దీర్ఘమైన కంబకారణ్య ప్రయాణానికి మిట్టమధ్యాహ్నపు ఎండవేడిమితోడై ఆయనకు మతిభ్రమ కలిగించిం

దనుకున్నారు.

తనను సమీపించిన తిమిరర్షికి తాపసి భక్తితో నమస్కరించి, "మహర్షీ! పూర్వ జన్మలో నేను చేసిన మహాపాపం ఎలాంటిది? దానికి ప్రాయశ్చిత్తం ఏమిటి?" అని అడిగాడు.

"నీ పాప పరిహారానికి కావలసిన ప్రాయశ్చిత్తమేదో ఆ చెదపురుగులే చేసినై. ఇక నీ పాపం సంగతి కొద్దిలో – నాలుగు మాటలలో చెబుతాను. నువ్వు త్రేతాయుగంలో ఒక పశువుల కాపరివి. రోజూ అరణ్యంలో పశువులను మేపుతూ ఉండేవాడిని. ఆ ప్రాంతాలనే ఏకవస్త్రుడు అనే ఒక ముని తపస్సు చేసుకుంటుండేవాడు. ఆయన కున్నదల్లా ఒకేఒక అంగవస్త్రం. దానిని రోజూ ఆయన దాపునున్న కొలనులో ఉతికి ఒడ్డున ఆరవేసి, అది ఎండిన దాకా ఆయన కొలనులోనే గొంతు వరకు నీటిలో మునిగి వుండేవాడు. నువ్వొకనాడు, ఆ ముని ఆ విధంగా కొలనులో గొంతు బంటికి మునిగి ఉండగా, ఒడ్డున ఆరవేసిఉన్న అంగ వస్త్రాన్ని అపహరించావు. ఆ సంగతి తెలిసి వస్త్రహీనుడు గనుక ఆ ముని నిన్ను వెంబడించి పట్టుకొనలేక, కొలనులో ఉండే నిన్ను రాబోయే జన్మలో దిగంబరిగా బతకమని శపించాడు. క్షమించమని నువ్వు ఆయన కాళ్ళవేళ్ళ పడి శాపం ఉపసంహరించుకోమని ప్రార్థించావు. అందుకాయన కొంచెం ప్రసన్నుడై కాలకౌపీనం అనుగ్రహించాడు" అని తిమిరర్షి చెప్పాడు.

"అలా అయితే నేను బ్రతికినంత కాలం యిలా ఈ చెట్టు క్రింద పడివుండవలసిందేనా మహర్షీ?" అని అడిగాడు కాలకౌపీనుడు దీనంగా.

"నీ తపశ్శక్తి మాటేమిటి? దానితో ఒక్క కౌపీన్నాన్నయినా సృష్టించుకోలేవా?" అని ప్రశ్నించాడు తిమిరర్షి.

"మహర్షి ఏం చెప్పేది. నే సంపాయించిన తపశ్శక్తినంతా అధోముఖంగా చేసి, చెదపురుగు మూడు వంతులు కౌపీనాన్ని తినివేసినట్టు గ్రహించాను. యిప్పుడు నాలో యే శక్తీ లేదు" అన్నాడు కాలకౌపీనుడు.

తిమిరర్షి తన దివ్యదృష్టిని ప్రయోగించి కాలకౌపీనుడి పద్మాసనం క్రింద వున్న లక్షలా కోట్లా చెదపురుగుల్ని పరిశీలించి చూచి, అవి కౌపీనుడి శరీరానికి ఏమాత్రం హాని కలిగించకపోవటానికి ఆశ్చర్యపడ్డాడు. తరువాత ఆయన కాలకౌపీనుడిలో ఏదో కొద్దిపాటి తపశ్శక్తి లాంటిది ఉన్నదని, అందుచేతనే చెదలు అతడికి హాని కలిగించలేకపోయాయనీ, గ్రహించాడు. ఆ తరువాత ఆయన దివ్యదృష్టికి కనపడవలసినదంతా కనబడింది.

'ఓహో అదా ఉపాఖ్యానం! శ్రీకృష్ణుడి ప్రణయగాథలో యితగాడికి కింత పాలున్నదన్నమాట! ఎంత అదృష్టవంతుడు!' అనుకున్నాడు తిమిరుడు.

"ఇదిగో, నా అరచేతికేసి చూడు కాలకౌపీనా!" అంటూ తిమిరర్షి తన అరచేతిని కాలకౌపీనుడి కండ్ల ముందుకు తీసుకుపోయి, "చూస్తున్నావా – కనబడిందా ఆ ముందు వచ్చే వాళ్ళిద్దరూ అభిజాత్యుడూ, చంద్రముఖీ! వాళ్లెవరో కాదు – శరవణ రాజ్యపు రాజూ, రాణీ! వాళ్ళకు కుబ్జకన్న కురూపి అయిన తమ ఏకైక పుత్రిక వివాహ సమస్య తేలక, నీ సలహా కోసం వస్తున్నారు.

సహాయం చెయ్యి. ఆ అభిజాత్య మహారాజు వల్ల నీకు ఏకాధిక శత కౌపీనాలు లభించగలవు. ఆ తరువాత నీవు సమాధి నిష్టలు కుదిరి కాలకౌపీన మహర్షి పేరుతో జగత్ప్రసిద్ధుడవు కాగలవు" అని చెప్పి తిమిరర్షి చప్పున వెనుదిరిగి బయలుదేరాడు.

కాలకౌపీనుడు ఆదుర్దాగా లేవబోయిన వాడల్లా అంతలోనే సర్దుకొని, "మహర్షీ! నన్ను మరింత చిక్కులో పెట్టిపోతున్నారు. ఈ కాలకౌపీనంతో రాణి కంట యెలాపడటం? ఆమె కురూపి కూతురు వివాహ సమస్యను ఎలా పరిష్కరించటం?" అంటూ కేకలు పెట్టాడు.

"ఆవన్నీ అవతార పురుషుడైన ఆ కృష్ణుడే చూసుకుంటాడు. అతనెంత అమానుషుడో నీకు తెలియదు" అంటూ తిమిరర్షి శిష్యులు వెంటరా చరచరా నడిచి పోయాడు.

ఇక్కడ అపోహలకు తావులేకుండా చంద్రముఖీ అభిజాత్యుల గురించి ఒకటి రెండు మాటలు చెప్పవలసి ఉంటుంది.

పురాణ ప్రసిద్ధుడైన అభిజాత్య మహారాజు యితడుగా కనుపించడు. అతడి భార్య పేరూ చంద్రముఖీ అయినా అతడూ ఇతడూ ఒకరే అనేందుకు అస్కారం లేదు. ఆ అభిజాత్యుడు... సప్తపాదోధివేలా విభ్రాజదఖండ భూవలయమో.....ఏదో పాలించినట్టు ఆధారాలు లాంటివి కొంచెంగా కనబడుతున్నవి. పైగా అతడు అశ్వమేధయాగం తప్ప అన్ని యాగాలూ, నరమేధం తప్ప అన్ని మేధాలూ చేసినట్టు గట్టి గుర్తులే వున్నవి.

ఈ కాలకౌపీన శ్రీకృష్ణుల సమకాలీనుడైన ఈ అభిజాత్యుడు చాలా చిన్నరాజు. పాలించేది చారెడంత నేల. అందులో ప్రసిద్ధి గన్నదీ, బొక్కసానికి నాలుగు డబ్బులు చేర్చేదీ...శరవణ సరస్సు. అది కుమారస్వామి జన్మించిన చోటని స్థలపురాణం. ఎలా నమ్మటం? ఏదేమైతేనేం చీకటి దోషాలూ, రేచీకటి తప్పులూ ఆ శరవణంలో వచ్చిపడుతూండేవి. అభిజాత్య మహారాజు సరస్సు కావలికి నియోగించిన ఉద్యోగులూ, పాపం సజీవమా, నిర్జీవమా, ఏ లింగం యిలాంటి భోగట్టా సేకరించి వాటివాటికి నిర్ణయించిన సుంకాలు వసూలు చేసి బొక్కసానికి పంపుతూండేవాళ్ళు.

సరే, అభిజాత్య మహారాజు తన రాణితో కొద్ది పరివారంతో తనను సమీపిస్తున్నట్టు చూసిన కాలకౌపీనుడు శరీరం మీద చీమలూ జెర్రులూ పాకుతున్నట్టు గొడవపడిపోయాడు. ఏమయితే అదవుతుంది – లేచి పరుగెత్తుదామనుకున్నాడు గాని తనవల్ల శ్రీకృష్ణుడి కార్యమేదో జరుగనున్నదని జ్ఞానతిమిరర్షి చెప్పిన మాటలు గుర్తుకువచ్చి, తననుతాను సముదాయించుకున్నాడు.

అభిజాత్య మహారాజు వస్తూనే, కాలకౌపీనుడికి సాష్టాంగపడిపోయాడు. రాణి కూడా భర్తను అనుసరించింది. అదేక్షణంలో కాలకౌపీనుడు తన శరీరంలో యేదో మహత్తర శక్తి ప్రవేశించినట్టు అనుభూతి పొందాడు. అతడి ముఖం బ్రహ్మవర్చస్సుతో దగద్ధగాయమానంగా మెరిసిపోయింది.

"లే, రాజా, లే! ఏమి నీ కోరిక?" – అంటూ కౌపీనుడు అభిజాత్యుణ్ణి ఆశీర్వదించి, ప్రశ్నించాడు.

"మహామునులైన తమకు నా కోరిక సంగతే తెలియదా? నన్ను పరీక్షిస్తున్నారా, మహా మునీంద్రా?" – అన్నాడు అభిజాత్యుడు చేతులు జోడించి.

కాలకౌపీనుడు చిరునవ్వు నవ్వాడు. తరవాత కాలకౌపీనానికి స్వస్థాన భ్రష్టత్వం కలిగిందేమో

అని భయంగా ఓమారు చూసుకుని, తృప్తుడై, రాజా రాణీల కేసి ముఖం తిప్పి, "అవును అభిజాత్యా! మీరు ఎలాంటి చిక్కుల్లో వున్నారో నాకు సర్వం తెలుసు. ఆమె కురూపి అయినా, వరపుత్రి!" అన్నాడు మందహాస వదనంతో.

"మునీంద్రా! మా ఏకైక పుత్రిక శుభాంగి వరప్రసాదిని అని మాకూ తెలుసు. సంతానం కోసం ఎన్నెన్ని వ్రతాలో తీర్థయాత్రలో పూజలో చేసి, విసిగి వేసారిన మాకు, ఒకానొక యోగీంద్రుని కరుణాకటాక్షం వల్ల ఆమె కలిగింది. 'అన్ని వ్రతాలూ, పూజలూ భక్తిశ్రద్ధలతో నిర్వహించావు. బావుంది! కాని. సంతాన ప్రాప్తి కలుగలేదు. ఇక చేయవలసిందల్లా ఒకే ఒక వ్రతం, బ్రహ్మచర్య వ్రతం. మీ భార్యాభర్తలు ఒక నిండు సంవత్సరం పాటు కటిక బ్రహ్మచర్యం అవలంబిస్తే, మీకు సంతానం కలుగుతుంది' అని యోగీంద్రుడు మాకు ఆనతిచ్చాడు. ఆ విధంగానే మేము ఒక సంవత్సరం నిష్ఠతో బ్రహ్మచర్యం పాటించేసరికి, నా భార్య గర్భవతియై స్త్రీ శిశువును కన్నది. కాని ఆమె..." – అభిజాత్య మహారాజు కంఠం గాద్గదికమయింది.

"నాకు సర్వం తెలుసు అభిజాత్యా! ఆ నీ కుమార్తె శుభాంగికి ఈనాటితో పదునెనిమిదేండ్ల వయసు నిండింది. నీకు ఆమె వివాహ సమస్య ఎదురయింది. కురూపిని ఎవరు చేసుకుంటారని విచారిస్తున్నావు – అంతేనా?" అన్నాడు కాలకౌపీనుడు.

అభిజాత్య మహారాజు అవునన్నట్టు తలనూపి, "మునీంద్రా! నా కోశాగారాన్ని వెండి బంగారాలతో నింపే, ఆ శరవణ సరస్సును కట్నంగా యిస్తానన్నా ఎవరూ నా కుమార్తెను వివాహమాడరని నాకు నమ్మకం కలిగిపోయింది. యిక ఏమిటి దారి?" అంటూ వాపోయాడు.

"నీ కుమార్తె శుభాంగి కురూపి అని లోకానికి తెలియదు. అవునా?" అని అడిగాడు కాలకౌపీనుడు.

"అవును మునీంద్రా! ఆ విషయమై మేము ఆ పిల్ల పుట్టినప్పటి నుండి జాగ్రత్త పడ్డాం. బిడ్డ అతిలోక సౌందర్యవతి అనీ, పరులు చూస్తే దృష్టిదోషం తగులుతుందనీ చెప్పి, ఆమెను అంతఃపురందాటి బయటికి వెళ్ళనివ్వలేదు" అన్నాడు అభిజాత్యుడు.

కౌపీనుడు తన జ్ఞాననేత్రాన్ని తెరిచి చూచాడు. అతడికి తన కౌపీనాన్ని మూడు వంతులు తిని బలిసిన చెదపురుగులు తప్ప మరేమీ కనుపించలేదు. 'ఓహో! నా తపశ్శక్తినంతా చెదలుకు ధారపోశానే ఇప్పుడేమిటి చెయ్యటం?' – అనుకుంటూ అతడు జ్ఞాననేత్రాన్ని మూసి, కొంచెంసేపు దీర్ఘాలోచన చేసి, చప్పున మందస్మితుడై, "అభిజాత్యా విచారించకు! నీ కుమారి శుభాంగి నిజంగానే శుభాంగి అవుతుంది. అందుకు వున్న మార్గం ఒకే ఒకటి. ఆమె మనసారా ప్రేమించిన వాణ్ణి వివాహం చేసుకోవాలి!" అన్నాడు.

"అది సాధ్యమా, మహామునీంద్రా?" అని ప్రశ్నించాడు అభిజాత్యుడు భయంగా.

"యెందుక్కాదు?" అని ఎదురు ప్రశ్న వేశాడు కౌపీనుడు.

అభిజాత్య మహారాజు ఏదో అడగబోయి, తన భార్య ముఖం కేసి చూసి, తల దించుకున్నాడు.

అది గమనించిన కౌపీనుడు పెద్దగా నవ్వి, "అభిజాత్యా, సంశయ కీలల్లో మ్రగ్గకు, కుబ్జ అనే

త్రివక్ర సంగతి నీకు తెలుసుకదా? శుభాంగి అంతకన్నా అందవిహీనురాలా? ఇక వెళ్లు. నాకు తపస్సుకు కాలాతీతమవుతున్నది" అంటూ కళ్లు మూసుకున్నాడు.

"మునీంద్రా! మీ సహాయానికి కృతజ్ఞుణ్ణి. ఈ సేవకుణ్ణించి తమరెలాంటి సేవ కోరుతారు?" అన్నాడు అభిజాత్యుడు.

"నాకు ఎవరి సేవలూ, సహాయాలూ అవసరంలేదు. అరణ్యంలో చెట్టు క్రింద కూచుని పొడి గాలితో డొక్క నింపుకుంటూ, అరిషడ్వర్గాలనూ జయించిన నాబోటి వాళ్ళకు ఏ అవసరాలుంటవి? ఒకవేళ ఉన్నా, నోరు తెరచి నాకై నేను ఎలా అడగటం? భక్తులే గ్రహించాలి" అన్నాడు కాలకౌపీనుడు కళ్లు మూసుకునే.

మహారాణి చంద్రముఖి తలాడించింది. దానికి ప్రతిగా మహారాజు అభిజాత్యుడూ తలాడించాడు. ఆ తరువాత భార్యాభర్తలిద్దరూ మౌనంగా కౌపీనుడికి నమస్కరించి, రాజధాని శరవణ నగరం కేసి బయలుదేరి వెళ్ళారు.

ఆ రాత్రి అభిజాత్య మహారాజు కల గన్నాడు.

ఆ కలలో మహావిష్ణువు ప్రత్యక్షమై, "రాజా, లేలే! నిద్రకు ఇది సమయం కాదు. నీ కుమార్తె శుభాంగినికి నగరం వెలుపల ఒక ఒంటి స్తంభం మేడ కట్టి అందులో వుంచు. ఆ మేడ ఎత్తు అరవై నిలువులకు తగ్గకూడదు. దాని అగ్రాన మనిషి దూరగల ఒకేఒక రంధ్రం వుంచి, నీ కుమార్తెను వివాహమాడకోరిన వాడు అందులోనుంచి లోపలకు ప్రవేశించాలని చాటింపు వేయి. ఆ తర్వాత అంతా శుభం అవుతుంది" అంటూ మాయమయ్యాడు.

అభిజాత్య మహారాజు విష్ణువు నుంచి కొన్ని సందేహాలకు సమాధానాలు అడుగుదామనుకున్నాడు కాని, అంతలో విష్ణువు మాయమవటం, ఆయనకు మెలుకువ రావటం జరిగిపోయింది.

ఆయన అప్పటికప్పుడే పక్కన నిద్రిస్తున్న భార్య చంద్రముఖిని నిద్ర లేపి, తనుకన్న కల వృత్తాంతం చెప్పాడు. ఆమె పొందిన ఆనందం అంతా యింతా కాదు.

"వేగిరం ఆ ఒంటి స్తంభం మేడ ఏదో నిర్మించేయండి. అమ్మాయి శుభాంగికి త్వరలోనే కళ్యాణయోగం ఉన్నదన్నమాట!" అంటూ రాణి భర్తను తొందర పెట్టింది.

అభిజాత్యుడు భార్య వేగిరపాటుకు విస్తుపోతూ, "మనం ఈ పగలు దర్శించిన యోగిపుంగవుడు చెప్పింది నీకు గుర్తుందా? అమ్మాయి తాను మనసారా ప్రేమించిన వాణ్ణి వివాహమాడితేనే ఆ కురూపితనం పోయి సౌందర్యవతి అవుతుంది. ఇంతకు అమ్మాయి ఎవర్ని ప్రేమిస్తున్నట్టు!' అన్నాడు.

"అమ్మాయి యెవర్ని ప్రేమిస్తున్నదో ఆ సంగతంతా నాకు తెలుసు. మగవాళ్ళు మీ కెందుకు ఆడవాళ్ళను గురించిన వైనాలు? వేగిరం ఒంటి స్తంభం మేడ కట్టించి, అమ్మాయిని అందులో ప్రవేశపెట్టి, ఆ విషయం చాటించేయండి" అన్నది రాణి మంచం మీంచి ఎగిరి కిందికి దూకుతూ.

అభిజాత్యుడికీసరికి తన కూతురు ఎవర్ని ప్రేమించిందో అర్థమయింది.

"త్రివక్ర మరుగుజ్జు అయిన కుబ్జ కన్నా నా కుమార్తె కొంత మెరుగేనని నమ్మకం. యేమో,

దానదృష్టం ఎలా ఉన్నదో?" - అనుకొంటూ అభిజాత్యుడు ఆ రాత్రికి రాత్రే ఒంటి స్తంభం మేడ నిర్మాణానికి, ఆ విషయాలు దేశదేశాలా చాటింపు వేయటానికి ఆజ్ఞ యిచ్చాడు.

శరవణ నగర రాజైన అభిజాత్యుడి ఏకైక పుత్రిక శుభాంగి పరమ ఘోరమైన నాతి - కఠిన కురూపి అన్న సంగతి, ఆమె తల్లిదండ్రులకూ, పెంచిన దాదికే తప్ప మరెవరికీ తెలియదు.

లోకమంతా చెప్పుకోవటం, ఆమె రూపలావణ్య గుణాతిశయురాలని.

ఇక్కడ శరవణ నగరం వెలపల తెల్లవారుతూనే అరవై నిలువుల ఎత్తు ఒంటి స్తంభం మేడను తాపీపనివాళ్ళు ఆఘమేగాల మీద కట్టి వేస్తుండగా, అక్కడ శ్రీకృష్ణ సందర్శనార్థం కాగల కొందరు ఋషులతో బయలుదేరిన జ్ఞానతిమిరర్షి అప్పుడే ద్వారక ప్రవేశిస్తున్నాడు. ఆయన యింత ఆలస్యంగా ద్వారక చేరటానికి కారణం - సాంబుడనే ఒక కొంటెకాయి, అరణ్యంలో ఆయనను తప్పుదారి పట్టించటం.

'వీడు తప్పక యాదవ కులాన్ని ముంచుతాడు' అని తిమిరర్షి అప్పుడే అనుకున్నాడు.

ద్వారక ప్రవేశిస్తూనే తిమిరర్షి అభిజాత్యుడి చాటింపు విన్నారు. 'ఓ కృష్ణుడికి చేతినిండా పని' అనుకుంటూ ఆయన సరాసరి సత్యభామ యింటికివెళ్ళి క్రిష్ణ దర్శనం చేసుకున్నాడు.

"ఏం మహర్షీ! సూటిగా యిక్కడికి వచ్చేశావ్? నేను సత్య యింటనే వుంటానని నీకెలా తెలుసు? నాకు అష్టభార్యలే కాక, పదహారువేల గోపికలు కూడా వున్నారు గదా? ఎవరి యింటనైనా వుండవచ్చునే" అన్నాడు శ్రీకృష్ణుడు.

దానికి తిమిరుడు చిరుగా హసించి, "పురుష వృషభా! నీ గురించి నారదమౌని సర్వం నాకు చెప్పాడు. ఒకసారి ఆయన నీ వింతమంది భార్యలతో ఎలా కాపరం చేస్తున్నావో చూడవచ్చి, అన్ని వేల గోపికల దగ్గరా అష్టభార్యల వద్దా నీవు కనబడగా, ఆశ్చర్యపడి అసలు కృష్ణుడెవరో, మాయ కృష్ణులెవరో తన దివ్యదృష్టి వల్ల తెలుసుకుని, సత్యభామాదేవి వద్ద వుండేవాడే అసలు కృష్ణుడుగా గ్రహించి, నాకు చెప్పాడు" అన్నాడు.

ఈ జవాబుతో కృష్ణుడు బాగా కంగారు పడిపోయి, ఆ చుట్టుపక్కల ఎక్కడా సత్యభామ లేదని తెలుసుకుని, తిమిరర్షి చెవి దగ్గిరగా వంగి, రహస్యంగా, "మహర్షీ, ఈ సంగతి రుక్మిణి, మిత్రవింద, నాగ్నజితి మొదలుగాగల నా భార్యలకేగాక, పదహారువేల గోపికల్లో కూడా ఏ ఒక్కరికీ తెలియకూడదు. తెలిసిందా!" అన్నాడు.

"తెలియకేం, భామాసులభా! కాని, నువ్వు మరో కన్యారత్నాన్ని వరించబోతున్నావు" అంటూ తిమిరుడు చిరునవ్వు నవ్వాడు.

"మరో కన్యారత్నమా? హతోస్మి! ఇప్పటికే నా మీద చాలా అపవాదులు లేవనెత్తి, యాదవ యువగణంలోనే, నాకు చాలామందిని విరోధులుగా చేస్తున్నారు, నా శత్రువులు. వ్రేపల్లెతోగాని, ద్వారకతోగాని, పరాయి పల్లెల నగరాల వాళ్ళెవరూ వివాహ సంబంధాలు నెరపుటలేదు. 'అమ్మాయిని పేరుకు ఎవడికిచ్చి చేసినా, గద్దలా వచ్చి తన్నుకుపోయేది కృష్ణుడేగదా!' అంటున్నారట వాళ్ళు. దానితో యువలోకంలో చాలామందికి నేనంటే కన్నెర్రగా వున్నది" అన్నాడు కృష్ణుడు దిగాలు

పడిపోతూ.

"పాపం శమించుగాక! అపవాదకులు నశింత్రు గాక!" – అంటూ జ్ఞానతిమిరర్షి చిన్నగా శపించి, "అవునా, కృష్ణా, పురుషవ్యాఘ్రూ! కాని, ఇందులో ఓ చిన్న రహస్యం వుంది. శరవణ నగర కన్యామణిని తమదిగా చేసుకొనేందుకు, సాల్వుడూ, జరాసంధుడే కాక ఆఖరుకు నరకుడు కూడా ప్రయత్నించబోతున్నాడని కర్ణాకర్ణికగా నారదుని నుంచి విన్నాను. వీళ్ళంతా నీ పరమ శత్రువులు. పైగా, ఆ అభిజాత్య మహారాజు పుత్రీమణి నిన్నే ప్రేమించి, నీ కోసం అరవై నిలువుల ఎత్తుగల ఒంటి స్తంభం మేడలో అహోరాత్రులు పరితపిస్తున్నది. సరే నీ యిష్టం. నారదుడు పంపగా నే వచ్చిన పని అయింది – సెలవు!" అంటూ తిమిరర్షి నమస్కరించి నిష్క్రమించాడు.

శ్రీకృష్ణుడు పెద్ద చిక్కులో పడ్డాడు. ఒక విధంగా అవి అతడికి గడ్డురోజులు. జరాసంధుడి ధాటికి ఆగలేక ఆమధ్య ద్వారకా నగరం వదిలి కొంతకాలంపాటు ప్రవర్షణ పర్వతం మీద ప్రవాసం వుండవలసి వచ్చింది. నరకుడు బాధ ఎప్పుడూ వుండనే వున్నది! శిశుపాలుడి తమ్ముడు సాల్వుడు పగబట్టి మయుడి ద్వారా సౌభకమనే లోహ విమానాన్ని సంపాదించి, అడపాదడపా ద్వారకను రాళ్ళ వర్షంతో ముంచెత్తుతున్నాడు. పులి మీద పుట్రలా వీళ్ళందరికీ తోడన్నట్టు, పౌండ్రక వాసుదేవుడనే కాశీ వాస్తవ్యుడొకడు 'నేనే అసలు శ్రీకృష్ణుణ్ణి!' – అంటూ, తను లేనప్పుడు ద్వారకకు కూడా వచ్చి ప్రచారం చేసుకుపోయాడు.

'ఇన్ని చిక్కుల మధ్య వున్న నన్ను, ఎంత సౌందర్యరాశి అయితే మాత్రం, ఆ అభిజాత్య ప్రేమించటమేమిటి? ఆ ఆడజనాలకు – అందునా వయసు పిల్లలకు – వేళాపాళా తెలీదు' అనుకున్నాడు శ్రీకృష్ణుడు.

ఈ ఆఖరి మాటలు అప్రయత్నంగానే అతడి నోటి నుంచి వెలువడినై.

అప్పుడే గదిలోకి వస్తున్న వసంతకుడు అది చూసి, "కృష్ణా! ఏమిటా నిందావాక్యాలు? వలచి వలిపించుకోచూస్తున్న కన్యకామణిని అనవలసిన మాటలేనా అవి" అంటూ కస్సుమన్నాడు.

కృష్ణుడు విస్తుపోయాడు.

వారం రోజుల తరువాత అరవై నిలువుల ఎత్తున శరవణ నగర పొలిమేరల్లో లేచిన ఒంటి స్తంభం మేడను చూసి శుభాంగిని వరించి వచ్చిన రాజకుమారులు విస్తుపోవటమే గాక నిర్విణ్ణులయి పోయారు. నిలువునా తాళవృక్షంలా ఆకాశాని కంటుతున్న ఆ మేడ ఎక్కి వెళ్ళి చితారున వున్న కంతలో నుంచి రాజకుమారి వున్న గదిని చేరటం ఎలాగో ఎవరికీ అర్థం కాలేదు. మేడ కింది నుంచి పైకి నున్నగా అద్దంలా గచ్చుచేసి వున్నది. కాలుమోపేందుకెక్కడా ఆస్కారం లేదు. అయినా చితారు కొమ్మను మిఠాయి పొట్లం వున్నట్టు తెలిసిన యువకులు వూరుకుంటారా?

వాళ్ళల్లో కొందరు అరికాళ్ళకూ అరిచేతులకూ మాంచి తుమ్మబంక పట్టించుకుని గోడ పాకేందుకు ప్రయత్నించారు. అలా ప్రయత్నించిన వాళ్ళల్లో ఒకరు దాదాపు నాలుగు నిలువుల ఎత్తు పాకి ఎండవేడికి ఈలోగా తుమ్మబంక బిగుసుకుపోవటంతో గోడకు అంటుకు పోయాడు. యిక వాడు చేసిన ఆక్రందనాలకు అంతు లేదు. కాని, ఎవరు మాత్రం అతడికి ఏ విధంగా సహాయపడ

గలరు? పైగా కొందరు పోటీదారులు వాణ్ణి చూసి హేళన ప్రారంభించారు. ఎట్లయితేనేం వాడు ఒకటి రెండు గంటల తరువాత చేతుల్ని గోడ పట్టునుంచి పీక్కొని, దైవభజన చేస్తూ, మిట్టమధ్యాహ్నం వేళకు దభీమంటూ క్రిందపడి, నడుము విరిగినా ప్రాణాలతో బయట పడ్డాడు.

ఉడుం నడుం పట్టుకుని పాక చూసిన వాడికీ ఇదే గతి పట్టింది.

ఈ విధంగా ఒంటి స్తంభం మేడ చుట్టూ చిన్నా పెద్ద రాజులూ, రాజకుమారులూ చేరి రాజ కుమారి వున్న గది చేరేందుకు చేతనైన విఫలయత్నాలు చేస్తుండగా, చేది దేశపు రారాజైన సాల్వుడికి ఆ సంగతి తెలిసింది. ఆ తెలియటంలో శుభాంగి శ్రీకృష్ణుడిని ప్రేమించిందన్న వివరం కూడా అతని చెవిని పడింది. సాల్వుడు బుస్సుమన్నాడు.

"మా అన్న కాబట్టి చేతకాక రుక్మిణిని జారవిడిచాడు. నేనీ శుభాంగిని శ్రీకృష్ణుని పాలబడ నిస్తానా? ఏయ్ ఎక్కడ సౌభకం? సమాయత్తం చేయండి" అంటూ అతడు చరచరా సౌభకాన్ని యెక్కి కాంతివేగంతో వచ్చి ఒంటి స్తంభం మేడ చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించాడు.

"ఇందులో ఏదో మోసం వుంది మహారాజా!" అంటూ సౌభక సారధి తమ రాజుకు మేడ చివర నున్న చిన్న కంత చూసి, "ఇది మన లోహ సౌభకాన్ని నాశనం చేసేందుకు కృష్ణుడు వేసిన ఎత్తు. మన విమానం కాదుగదా దాని రెక్కో ముక్కో కూడా ఆ కంతలో పట్టవు. ప్రయత్నించామో విమానం కూలటం తథ్యం!" అని హెచ్చరించాడు.

తన విమాన సారధి చెప్పిన మాటలు అక్షరసత్యాలని సాల్వుడు గ్రహించాడు. అయినా చూస్తూ చూస్తూ, అతిలోకసుందరి శుభాంగిని శ్రీకృష్ణుడి పరం చెయ్యటం ఎలా?

"సారధీ! సౌభకాన్ని ఆ కంత దగ్గిరగా పోనివ్వు అదను చూసి నేను సౌభకం మీది నుంచి కంతలోకి దూకేస్తాను. ఆ లోపల రాజకుమారి!" అంటూ సాల్వుడు భుజాలు ఎగరవేశాడు.

"మహారాజా! తొందరపడకండి. ఆ దూకటంలో ఏమాత్రం గురి తప్పినా మీరు అరవై నిలువుల ఎత్తు నుండి కిందపడి ఏమౌతారో చెప్పటం సాధ్యం కాదు. అదుగో చూడండి ఆ చెట్ల మీద చేతు లకు చాటలు కట్టుకొని పక్షుల్లా ఎగర ప్రయత్నిస్తున్న రాకుమారులు కిందపడి ఎలాంటి దుర్మరణం పాలవుతున్నారో!" అన్నాడు సారధి.

సాల్వుడు అటుకేసి చూశాడు. శరీరం గగుర్పొడిచింది.

"సారధీ! సౌభకాన్ని చేదికి తోలు. సావధానంగా ఆలోచిద్దాం" అన్నాడు సాల్వుడు, దృష్టిని ఒంటి స్తంభం మేడ మీది కంతకేసి కసిగా సారిస్తూ.

శ్రీకృష్ణుడికి ఒంటి స్తంభం మేడ గురించిన వార్తలు ఎప్పుడుకప్పుడు తాజాగా అందుతూనే వున్నవి.

సాల్వుడు తన సౌభకంతో కూడా పనికాక, ప్రస్తుతానికి పలాయనం చేశాడు. ఏ నిమిషాన్నయినా తిరిగి రావచ్చు. జరాసంధుడు గిరివ్రజాన్నుంచి తన మిత్రుడైన హంస డింభకులతో బయలుదేరి వస్తున్నాడు. పౌండ్రక వాసుదేవుడు కాశీరాజుతో ససైన్య సమేతుడై బయలుదేరనున్నాడు...

యిలాంటి వార్తలు తన వేగుల నుంచి వింటుంటే కృష్ణుడికి ఎక్కడలేని ఆదుర్దా పుట్టుక వస్తు

న్నది. శుభాంగి పేరు అతడి హృదయాన్ని ప్రేమలో ముంచెత్తుతూంటే, సాల్వుడి పేరు అతడి ఘన భుజాలను యుద్ధోత్సాహంతో పొంగింప చేస్తున్నవి.

"వసంతకా! యిక మనం ప్రయాణించవలసిన సమయం ఆసన్నమయింది. రథాన్ని సిద్ధం చేయించు!" అన్నాడు కృష్ణుడు చేతిలోకి వేణువును తీసుకుంటూ.

వసంతకుడు ఆ మాటలకు ఉలిక్కిపడి, "వాసుదేవా! ఏమిటి నీ పథకం? వేణుగానంతో ఆ అరవై నిలువుల మేడను కరిగింపజేసి శుభాంగిని హృదయానికి హత్తుకుందామనుకుంటున్నావా?' అని అడిగాడు.

"ఒంటి స్తంభం మేడ గోపకామిని కాదు. అసంగతాలు పలుకకు" అన్నాడు వాసుదేవుడు చిరు కోపంగా.

"ఓహో తెలిసింది - అదా కథ - రథం ఇప్పుడే సిద్ధం చేయిస్తాను" అంటూ వసంతకుడు బయటికి పరుగెత్తబోయాడు.

కృష్ణుడు వసంతకుణ్ణి, "ఏయ్ వసంతకా! ఆగు" అంటూ కేకపెట్టి, "నీ వనుకునేదేమిటి? శుభాంగి గదిని నే నెలా చేరబోతున్నాని, నువ్వు ఊహిస్తున్నావ్?" అని ప్రశ్నించాడు ఆశ్చర్యపడుతూ.

"అరవై నిలువుల మేడ నీ కొక లెక్కా! విరాట్ స్వరూపంతో ఆ కంత ఎత్తు పెరిగి, తరవాత సూక్ష్మరూపంలో దాని నుంచి గదిలోకి ప్రవేశిస్తావు. తరవాత జరగబోయేది అనుభవమైనదే!" అంటూ వసంతకుడు పొట్టచెక్కలయ్యేలా నవ్వసాగాడు.

వాసుదేవునకు కూడా అంత పెద్దగా నవ్వాలనిపించింది. కాని పక్క గదిలో నిష్ఠగా అలంకరణ చేసుకుంటున్న సత్యభామకు నిష్ఠాభంగమవుతుందని తమాయించుకున్నాడు.

వాసుదేవుడు రథంలో వచ్చి ఒంటి స్తంభం మేడ దగ్గర దిగేసరికి, శుభాంగి పాణిగ్రహణార్థం వచ్చిన రాజులూ, రాకుమారులూ హాహాకారాలు చేశారు.

"అష్టభార్యలూ, పదహారు వేల గోపకాంతలూ అయినా ఆశకు అంతు లేదు. ఏం మనిషి? ఛీ ఛీ!" అన్నారు కొందరు.

"ఇక మనం ఇళ్ళకు పోవచ్చు. రావలసిన వాడే వచ్చాడు" అన్నారు మరికొందరు.

"అయినా కాస్త ఆగి చూద్దాం. ఇతగాడికి మాత్రం మనకు తోచని వుపాయం ఏం తోస్తుందబ్బా! ఈ అరవై నిలువుల మేడ ఎలా ఎక్కుతాడో చూద్దాం" అన్నారు ఇంకొందరు.

శ్రీకృష్ణుడు ఈ దూషణ తిరస్కారాలేవీ వినటం లేదు.

అతడు నింపాదిగా రథం నుంచి దిగి, వసంతకుడు వెంటరా, మేడ కేసి నాలుగడుగులు నడచి, వేణువును మేడకంత కేసి ఓసారి ఎత్తి, పదునాల్గు భువనాలనూ సమ్మోహింపజేసే మోహన బంసీ విద్యుత్ కిరణ నాద శకలాలను నలువైపులా ప్రసరింపసాగాడు.

రాజులూ, రాజకుమారులూ ఆ గాన తరంగ ఘాతాలకు జంత్రపు బొమ్మలై పోయారు. కొందరినా మధుర గానం మత్తులో ముంచింది. కొందరిని మైకంతో కమ్మింది. ఎవరిలోనూ చలనం లేదు. గాలి స్తంభించింది. వేయేల? ప్రకృతి వికృతయింది.

శ్రీకృష్ణుడు వేణువును వాయిస్తూనే తల ఎత్తి మేడ కంత కేసి చూచాడు.

అక్కడ నుంచి ఒక బలమైన తాడు క్రిందికి జారుతున్నది. కాని ఆ జార్చుతున్న హస్తం మాత్రం అతడికి కనిపించటం లేదు.

తాడు క్రమక్రమంగా కిందికి వచ్చి, తన చేతికి అందే ఎత్తు రాగానే కృష్ణుడు దానిని రెండు చేతులతో గట్టిగా పట్టుకున్నాడు. ఆ ప్రయత్నంలో వేణువు అతని చేతిలో నుంచి జారి కింద పడిపోయింది.

"ప్రమాదం! తొందరగా చేదుకో" – అంటూ కృష్ణుడు వెర్రిగా పెద్ద కేక పెట్టాడు.

అదే క్షణంలో అప్పటి వరకూ వేణుగాన మాధుర్యంతో మైమరచివున్న రాజులూ, రాకుమారులూ మేల్కొన్నారు. వాళ్లు కళ్లు తెరిచి చూసేసరికి కృష్ణుడు మేడ మీదికి ముప్పై నలభై నిలువులు ఎత్తుకు వెళ్ళిపోయాడు.

"ఇది మోసం, ధర్మవిరుద్ధం, అన్యాయం" – అంటూ కింద నుంచి గోల బయలు దేరింది.

కొందరు అక్కడ చేతి కందిన రాళ్లూ రప్పలూ కృష్ణుడి కేసి విసిరారు. మరికొందరు విల్లంబుల కోసం పరుగెత్తారు.

కాని ఈలోపల కృష్ణుడు మేడ మీది కంత చేరనే చేరాడు. అతడు కంత అంచు పట్టుకొని, తాడు వదలి లోపలకు దిగుతూనే, మేలిముసుగు కొంచెంగా తొలిగించి తనకేసి చూచుచున్న శుభాంగిని చూసి, "హాఁ" అంటూ పెద్దగా అరచి ముందుకు విరుచుకు పడిపోయాడు.

అదే సమయంలో శుభాంగి కూడా తన కళ్లు మిరిమిట్లు కొల్పగా "హాఁ!" – అంటూ పక్కకు వరిగి శ్రీకృష్ణుడి మీద పడిపోయింది.

శుభాంగీ శ్రీకృష్ణులు తమ తమ మూర్ఛల నుంచి ఎంతకాలానికి తెలివి తెచ్చుకున్నారో, చెప్పటం కష్టం. కాని ఇద్దరిలో ముందుగా కృష్ణుడికి మూర్ఛవదలి పోయిన మాట నిజం!

అతడు కళ్లు తెరుస్తూనే శుభాంగి ముఖం కేసి చూడబోయి విహ్వాలుడై, కాసేటికి గుండె నిబ్బరం తెచ్చుకొని వేళ్ళ సందుగా ఆమె ముఖం చూసి, "హాఁ చంద్రవదనా! ఇందాక కనుపించినది నువ్వేనా నువ్వు?" – అంటూ ఆమెను బిగికౌగిట బంధించాడు.

శుభాంగి అతడి కౌగిలిలో ఉక్కిరిబిక్కిరైపోతూ, "అవును నాథా! ఆమెను నేనే? తమ స్పర్శ తగిలితే... గాలి సోకితే... కురూపులు రూపవతులవుతారని మీరెన్నడూ వినలేదా?" అన్నది.

"విన్నానుగాని నాకు మరుపు జాస్తి సుమా!" – అంటూ కృష్ణుడు చిన్నగా నవ్వాడు.

పైన దేవదుందుభులు మోగి, పుష్పవర్షం కురవ సాగింది.

కింద రణగొణధ్వని సాగి, బాణవర్షం లేచి ఒంటి స్తంభం మేడను కప్పేసింది.

శుభాంగీ కృష్ణుల కివేమీ తెలియవు.

ప్రేమ మహాత్మ్యం అట్టిది!

*

*(జ్వాల మాసపత్రిక : నవంబరు, 1963)*